# నేటి నుండి పోలేరమ్మ జాతర

## భారీగా తరలివస్తున్న భక్తులు

వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



కోరిన కోరికలు తీర్చే వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతర ఈ నెల 25, 26వ తేదీల్లో జరగనుంది. పోలేరమ్మ జాతర జరుగుతుందని ఈ నెల 11వ తేది, 18వ తేది సాటింపులు కూడా దేవదాయ శాఖ అధికారులు వేయించారు. 1730 సంవత్సరంలో పోలేరమ్మ జాతర జరిగినట్టు ఆధారాలు ఉన్నాయి. వెంకటగిరి పట్టణంలో రాజాలు పరిపాలించే రోజుల్లో కలరా, మసూచి రావడంతో శీతల యాగం పేరుతో అప్పట్లో జాతర నిర్వహించారు. శీతలయాగం చేయడంతో కలరా తగ్గడంతో అప్పటి నుండి జాతర చేస్తూ వచ్చారు. శీతల యాగం పేరును పోలేరమ్మ జాతరగా మార్చారు. బజార్ వీధిలో పోలేరమ్మ గుడి వద్ద అష్టబంధనం శిలను ఏర్పాటు చేశారు. పోలేరమ్మ రూపమంటూ గుడి వద్ద ఏమీ ఉండదు. వినాయక చవితి వెళ్లిన మూడవ బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతర నిర్వహిస్తారు. దేవతలను ఆహ్వానించేందుకు సాటింపులు వేస్తారు. ఈ నెల 25, 26 తేదీల్లో జాతర వచ్చింది. 25వ తేది సాయంత్రం పోలేరమ్మ అమ్మవారు ఇల్లుగా పిలిచే ఉమ్మరి వీధిలో అమ్మవారిని పుట్ట మట్టితో తయారు చేస్తారు. కళ్ళు పెట్టకుండా రూపాన్ని మాత్రం తయారు చేస్తారు. బుధవారం రాత్రి 11 గంటలకు కుమ్మర వీధి నుండి అత్తవారిల్లుగా భావించే జీనుగు వీధిలో అమ్మవారిని బంగారు నగలుతో అలంకరించి కనుబొమ్మలను ఏర్పాటు చేస్తారు. జీనుగుల వారి వీధి నుండి బజారు వీధిలోని గుడి వద్దకు రథం పై తీసకొని వచ్చి ఉంచుతారు. గురువారం సాయంత్రం వరకు అమ్మవారిని భక్తులు దర్శనార్థం ఉంచి అనంతరం రథంపై ఊరేగించుకుంటూ తీసుకొని వెళ్తారు.




## నామినేటెడ్ పదవుల

# జాతర షురూ..

### ఉమ్మడి జిల్లాలో పలువురు సీనియర్లకు చోటు.. !!

కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన ఇటీవలే పూర్తి చేసుకుంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల కానుకగా పార్టీల శ్రమించిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టాలని నిర్ణయించింది. మంగళవారం ఇరవై కార్పొరేషన్లకు నామినేటెడ్ పదవులు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలిసారి ప్రకటించిన పదవుల్లోనే ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు సీనియర్ నేతలకు చోటు కల్పించింది. నామినేటెడ్ పదవులు పొందిన వారిని పరిశీలిస్తే ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంకు చోటు దక్కింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్‌గా తిరుపతికి చెందిన తెదేపా నేత అనిమిని రవి నాయుడుకు ఛాన్స్ లభించింది. ఎపి పద్మశాలి సంక్షేమంమరియు అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా నగరికి చెందిన గంజి మాధవయ్య, తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన గంగాధర శ్రీరామదాసు, లక్ష్మీనరసింహులుకు స్థానం దక్కింది. ఎపి అర బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిరుపతికి చెందిన తెదేపా సీనియర్ నేత వూకా విజయ్‌కుమార్‌కు అవకాశం లభించింది. ఎపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిత్తూరుకు చెందిన కఠారి హేమలతకు చోటు దకి ్కంది. ఎపి మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన వెంకటరత్నం పరసాకు స్థానం లభించింది.అలాగే ఎపి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తంబళ్లపల్లికి చెందిన పర్వీన్‌తాజ్‌కు అవకాశం దక్కింది. సిఎం చంద్రబాబు నాయుడు పదవుల పంపకాలు మొదలు పెట్టడంతో ఎన్డీయే శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. ముమ్ముందు మరిన్ని కార్పొరేషన్ల పదవులు ఖరారు కానున్న నేపథ్యంలో పదవుల కోసం నేతలు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

## కల్తీనెయ్యి ఘటనపై విచారణ

# "సిట్"లో ఐపిఎస్‌లు జిల్లాకు సుపరిచితమే !



### -దేవుని లడ్డూఅపవిత్రంపై ఎవరివరికీ నోటీసులు ఇస్తారో!?

ప్రభాతవార్త-తిరుపతి:

దేవదేవుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పవిత్రలడ్డూ ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి దుమారంపై విచారణకు ప్రభుత్వం సిట్ బృందాన్ని నియమించింది. ఈ బృందంలో నియమితులైన ముగ్గురు ఐపిఎస్ అధికారులు ఉమ్మడి చిత్తూరుజిల్లాకు, తిరుపతి జిల్లాలో పనిచేసిన సుపరచితులే కావడంతో తిరుమల పవిత్రత, ఆచారవ్యవహారాలపై అవగాహన, పట్టు కలిగి ఉన్న అధికారులుగానే చర్చ సాగుతోంది. శ్రీవారి దర్శనం తరువాత అంతటి పవిత్రంగా భక్తులు భావించే లడ్డూప్రసాదాల తయారీలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డులో పెద్దలు, టిటిడి అధికారులు పవిత్రతకు భంగం కలిగించారని, ఏకంగా ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు ,చేపనూనె, ఇతరత్రా శాఖాహారపదార్థాల నూనె వాడారనే సంచలన వ్యాఖ్యలు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే చేయడంతో ఇప్పుడు ప్రాదాన్యత సంతరించుకుంది. అంతేగాక దేవుని ప్రసాదంలో కల్తీనెయ్యి వాడారనే ల్యాబ్‌ల పరీక్షల ఫలితాల నివేదికలు టిటిడి నుండి ప్రభుత్వానికి అందాయి. ఈ నేపథ్యంలో భక్తుల విశ్వాసాలతో ఆడుకున్న, తిరుమల పవిత్రతను భంగం కలిగించేలా వ్యవహరించి, కల్తీనెయ్యి వాడటానికి సూత్రధారులు, పాత్ర ధారులు ఎవరనేది తేల్చాలని ముఖ్యమంత్రి బలమైన నమ్మకంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో కల్తీనెయ్యి బాగోతంపై విచారణకు "సిట్"బృందాన్ని నియమించారు. ఈ బందంలో నియామకమైన ముగ్గురు ఐపిఎస్ అధికారులు ప్రస్తుతం గుంటూరు రేంజి ఐజి సర్వశ్రేష్టత్రిపాటి నేతృత్వంలో, అనకాపల్లి రేంజి డిఐజి గోపీనాథ్‌జెట్టీ, కడప జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజులు సభ్యులుగా నియమించారు. ఈ ముగ్గురు పోలీసు ఉన్నతాధికారులు గతంలో చిత్తూరు, తిరుపతిలోపనిచేసిన అనుభవం ఉంది. త్రిపాఠి 2006 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఆయన గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2008 మధ్యకాలంలో అదనపుఎస్పీగా,ఎస్పీగా పని చేశారు. అప్పట్లోనే ఆయన చిత్తూరుజిల్లాలో నేరాలనియంత్రణ, కరడుగట్టిన నేరస్తుల గుండెల్లో సింహస్వప్నంలా పనిచేసిన అనుభవంఉంది. తిరుమలపై మంచి పట్టుకలిగి వున్నాడు. వేంకటేశ్వరస్వామి వైభవం, పవిత్రత, ఆచారవ్యవహారాలపై, హిందూ ధర్మంపై అవగాహన కూడా ఉంది. ఇక సభ్యులుగా నియమితులైన డిఐజి గోపీనాథజెట్టీ 2008 ఐపిఎస్ బ్యాచ్ అదికారి. 2015లో తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉంది. అంతేగాక 2018 నవంబర్ నుండి 2022 ఏప్రిల్ వరకు ఆయన టిటిడి సివిఎస్ఓగా సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం కలిగివున్నాడు. టిటిడిలో స్వామివారి ఆచారవ్యవహారాలు, ఆచార్యవ్యవహారాలపై, పాలనపై పట్టుఉంది. ఇక కడపజిల్లా ఎస్పీగా ఉన్న వి.హర్షవర్ధన్‌రాజు 2024 మేనెలలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తిరుపతి జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. కొద్దినెలలే పనిచేసినా తిరుమలతో అనుబంధం ఉంది. ఆలయంలో భద్రత, పాలనపై పట్టుకలిగి వున్నాడు. ఈ ముగ్గురూ పోలీసు ఉన్నతాధికారులు జిల్లాకు సుపరిచితులే కావడం,దేవునిసేవలో తరించినవారే. మరీ కల్తీనెయ్యి బాగోతంపై ఎవరెవరి పాత్ర ఉంది, ఎందుకు పవిత్రతకు మంటగలిపారనేది విచారణలో తేలనుంది.

# దైవానికే శఠగోపం పెట్టిన వైకాపా నేతలను వదిలేదిలేదు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



ప్రపంచంలోని కోట్ల మంది ప్రజలు,భక్తులకు వరాలిచ్చే కలియుగ దైవానికే శఠగోపం పెట్టిన వైకాపా నేతలను ప్రభుత్వం వదలి పెట్టేది లేదని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైకాపా పాలనలో పవిత్రమైన తిరుమలను అపవిత్రం చేసారన్నారు.బాధ్యతా రాహిత్యంగా వ్యవహారించటమే కాకుండా హైందవ సమాజానికి తీరని ద్రోహం చేసారని ధ్వజమెత్తారు. భక్తుల మనోభావాలనుదెబ్బతీసిన వైకాపా నాయకులు కనబడిన చోట, మాట్లాడిన చోట ముఖం మీద మట్టి కొట్టాలని పిలుపు నిచ్చారు.ఒకనాడు తాము 'రెడ్డి అని' ఎంతో హుందాగా చెప్పుకునే వారమని, అయితే ఐదేళ్ళ పరిపాలించిన జగన్‌రెడ్డి వారి సహచరుల వల్ల నేడు రెడ్డి అని చెప్పుకోవటానికి సిగ్గుగా ఉందని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు.నెయ్యిలో కల్తీతో లడ్డు పవిత్రతను మంట కలిపారని ఇక ఒకటా రెండా ఏదెత్తుకున్నా తిరుమల పాలనలో కుంభకోణాల మయంగా మారిందని తీవ్ర ఆరోపణలు చేసారు.తలనీలాల జుట్టుకు సంబంధించి విదేశాలతో ఒప్పందాలతో రూ.100కోట్లు కుంభకోణం పేదవానికి దర్శనానికి చెల్లు చీటి చెప్పి 'శ్రీవాణి' అంటూ పేదలదేవుణ్ణి కేవలం పెద్దలకే పరిమితం చేసి తమ జేబులు నింపుకున్నారు సుబ్బారెడ్డి.మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, టిటిడి ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ధర్మారెడ్డిలు కలసి 'వెంకటేశ్వరస్వామికే పంగనామాలు పెట్టి తమ పబ్బం గడుపు కున్నారని ధ్వజమెత్తారు.వారికి భక్తి లేదు. దేవుడంటే భయం లేదు. పవిత్రి దివ్యక్షేత్రంలో తమ ఇష్టారాజ్యంగా ఉన్మాద పాలన సాగించారని సుధీర్‌రెడ్డి శివమెత్తారు. చిన్నారుల మనస్సుల మీద కూడా తిరుమల లడ్డుల్లో పందికొవ్వు,ఆవు కొవ్వు,చేపనూనెలను వాడారనే ప్రభావం చూపిందన్నారు. ఓ న్యాయనిపుణుడు మాట్లాడు తాడు . పందికొవ్వు 12వేలు అనిఎలా కలుపుతారని, ఆయన జీవితం జీసెస్ బిడ్డకు అంకితం చేసారని ఆయన హిందూవుల మనోభావాల గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు.ఎన్నికల తరువాత తాను స్వామి వారి దర్శనానికి వెళ్ళినపుడు తాను తన సతీమణి లడ్డుల్లో నాణ్యత లేదని, పొంగల్ రుచిగా లేదని రాతమూలకంగా టిటిడి ఫిర్యాదుల పుస్తకంలో రాసామని వివరించారు. పది రూపాయల వస్తువులకు టెండర్ పిలిస్తే రూ.5లకు టెండర్లు వేసి (రివర్స్ టెండర్) అవకాశాలు దక్కించుకున్న కాంట్రాక్టర్స్ నాసిరకం సరకులు కాకుండా ఎలాంటివి అందిస్తారని ప్రశ్నించారు.తిరుమల పవిత్రతకు భంగం కల్గించిన వారిని ఎవ్వరినీ ప్రభుత్వం వదలిపెట్టదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయకమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు,మాజీ మండల అధ్యక్షుడు తాటిపర్తి ఈశ్వరరెడ్డి,కన్నలి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రప్రభ వాహనంపై పార్వతీ తనయుడు

కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:



కాణిపాకం బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉభయదేవేరులతో కలసి విఘ్ననాధుడు చంద్రప్రభవాహనంపై కాణిపాకం పురవీధులలో ఊరేగుతూ భక్తులకు అభయహస్తమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా స్వామివారికి మంగళవారం చంద్రప్రభవాహన సేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణం పల్లె, బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, మారేడుపల్లె, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె మరియు కారకాంపల్లె గ్రామాదుల హరిజన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం మంగళ వాయిద్యాల నడుమ వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఉభయదారులు అష్టోత్తర శతకలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలయంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. తిరిగి రాత్రి గణనాధుడు ఉభయదేవేరులతో కలసి వేదపండితులు మం త్రోచ్ఛారణ నడుమ అర్చక స్వాముల పూజలందుకున్న అనంతరం రంగురంగుల విద్యుద్దీపాలు, వివిధ రకాల స్వదేశీ, విదేశీ జాతి పుష్పాలతో దేధీప్యమానంగా అలంకరించిన చంద్రప్రభ వాహనంపై అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధులగుండా ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్,ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## పిఎస్ ముని'రత్నా'నికి వరించిన

# ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవి !!

### - స్నేహితుడికి అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు !!



కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

ఎపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా కుప్పం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల పంపకాల్లో తన సహచర విద్యార్థి, స్నేహితుడైన పిఎస్ మునిరత్నంకు సిఎం చంద్రబాబు నాయుడు సముచిత స్థాన ం కల్పించారు. సిఎం చంద్రబాబునాయుడు తిరుపతి ఎస్వీయులో డిగ్రీ చదివే రోజులనుంచి పిఎస్ మునిరత్నం ఆయనకు సహచర విద్యార్థిగా ఉంటూ సన్నిహితుడిగా మెలిగారు. బి.ఎ., ఎల్.ఎల్.బి. పూర్తి చేశారు. ఇక పిఎస్ మునిరత్నం రాజకీయపరంగా నియోజకవర్గంలో సీనియర్ నాయకులు. కంగుంది పంచాయతీ సర్పంచ్‌గా రాజకీయ జీవితం ఆరంభించారు. అనంతరం కుప్పం ఎంపిపిగా, కుప్పం సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 2014-19లో కుప్పం రెస్కోఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా సైతం కొనసాగుతున్నారు. కుప్పం రాజకీయాల్లో వివాద

# శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు నియామకం

తిరుపతి,సెప్టెంబర్ 24ప్రభాతవార్త:



చదువుకునే రోజుల నుండి ఇప్పటివరకు తెలుగుదేశం పార్టీ అభిమానిగా....పార్టీ కోసం పోరాటాలు చేసిన యోధుడు. .ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్‌కు బంధువు అయిన అనిమిని రవినాయుడుపార్టీకి చేసిన సేవలకు అంచలంచలుగా శాఫ్ రాష్ట్రఛైర్మన్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం భర్తీచేసిన 20 కార్పొరేషన్‌ల ఛైర్మన్‌ల పదవుల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాఫ్ )ఛైర్మన్‌గా తిరుపతిజిల్లాకు చెందిన ఎ.రవినాయుడును నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రవినాయుడు పార్టీకి చేసిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువమంత్రి నారాలోకేష్ కలసి ఆయనకు క్రీడాంశాల్లో మరింత నైపుణ్యం, ఉనికి చాటుకోవడానికి అవకాశం ఇచ్చారు. శాఫ్ ఛైర్మన్‌గా రవినాయుడు నియమితులు కావడం పట్ల పలువురు తెలుగు యువత నాయకులు, పార్టీ శ్రేణులు, ఎస్వీయూనివర్సిటీ అధ్యాపకులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు. కాగా తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి నారాలోకేశ్‌కు రవినాయుడు ధన్యవాదాలు తెలిపారు.

# సంఘ మిత్ర చేతివాటం - డ్వాక్రా సొమ్ము 6 లక్షలు స్వాహా

సత్యవేడు, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం మల్లవారిపాళెం పడమరకు సంబంధించి ఇంతకు ముందు సంఘమిత్రగా పని చేసి స్వాహా చేసిన ఆరు లక్షల రూపాయలను మాకు ఇప్పించి న్యాయం చేయాలని పలువురు డ్వాక్రా సంఘం సభ్యులు విన్నవించారు. మంగళవారం మల్లవారి పాళెం గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘం సభ్యులు శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్‌ను కలసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఇంతకు ముందు మల్లవారి పాళెం పడమర సంఘమిత్రగా బాషా పని చేస్తున్నారన్నారు. అయితే శ్రీనిధి, సీఐఎఫ్లో తీసుకున్న రుణా లను అప్పటి సంబంధిత సంఘమిత్ర ద్వారా సభ్యులు చెల్లిస్తూ వచ్చామన్నారు. అయితే తాము చెల్లించిన రుణ వాయిదా సొమ్మును ఆయా ఖాతాల్లో జమ చేయకనే సంఘమిత్ర స్వాహా చేయడం బయట పడిం దన్నారు. తమ రుణాలు స్వాహాపై ఏడాది క్రితమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే సొమ్మును సంఘమిత్ర నుంచి బట్టలేక పోయారన్నారు. దీంతో గత సార్వత్రిక ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సమాచారం అందుకున్న అధికారులు గ్రామానికి చేరుకుని స్వాహాచేసిన రుణం సొమ్మును రికవరీ చేపిస్తామని, సంఘమిత్రపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బహిష్కరణ ఉపసంహరించుకున్నామన్నారు. కానీ ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆరు లక్షలను రికవరీ చేసి తమకు న్యాయం చేయాలన్నారు. కాగా ఎస్ఐ హరిప్రసాద్‌కు ఫిర్యాదు చేసిన వారిలో మల్లవారిపాళెం పడమర డ్వాక్రా సంఘం సభ్యులు లక్ష్మి, సుగుణ, లలిత, బుజ్జమ్మ, లక్ష్మి, మంజుల, రేవతి, గీతమ్మలు ఉన్నారు.

## చెన్నూరులో

# మహిళ దారుణ హత్య

గూడూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరులోని శెట్టి గారి బీడు ప్రాంతంలో మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు వివాహేతర సంబంధం కారణంగా పచ్చికాల ఆనందమ్మ (42)ను అల్లుడు అయిన పాలేవు రమేష్ అత్యంత దారుణంగా కర్రతో కొట్టి హత్య చేశాడన్నారు. వివాహిత అయిన ఆనందమ్మ వరుసకు అల్లుడు అయిన రమేష్‌తో గత కొంతకాలంగా సహజీవనం చేస్తుంద న్నారు. నిందితుడు రమేష్ తన కుటుంబాన్ని వదిలి మృతురాలితో కలిసి వంట మాస్టర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్ధలు చోటు చేసుకోవడంతో తరచూ గొడవలు జరుగుతుండేవి అని ఈ క్రమంలో తెల్లవారు జామున ఇంట్లో నిద్రిస్తున్న ఆనందమ్మను తలపై కర్రతో గట్టిగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# హర హర బావి వీధిలో భారీ చోరీ

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి టూటౌన్ పరిధిలోని హరహర బావి వీధిలోని ప్రధాన దారిపక్కనే ఉన్న ఇంటిలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. 17 సవర్ల బంగారు,ఒక కిలో వెండి పూజా వస్తువులు,రూ.10వేల నగదు చోరికి గురైనట్లు సమాచారం. సంఘటన సమాచారం అందినవెంటనే సిఐ వెంకటేశులు వారి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే చేతి ముద్రల నిపుణులను రప్పిం చారు. డాగ్‌స్క్వా డ్‌ను రప్పించారు.మంగళవారం ఉదయం ఇంటిని శుభ్రం చేయటానికి వచ్చిన పని మనిషి తలుపులు తీసి వేయటంను గమనించి ఇంటి యజమానులకు సమాచారం అందించింది. పట్టణంలోని ఆగ్నిమాపక యంత్రం కార్యాలయానికి సమీపంలోని వినాయక గుడి సమీపంలో ఆర్‌టిసిలో పని చేసిన డిఎన్ మూర్తి, ఆయన సతీమణి పద్మశ్రీదేవి ఇద్దరే నివాసముంటున్నారు. వారు తన తనయుని ఇంటికి పొరుగూరు వెళ్ళినట్లు సమాచారం.అయితే మంగళవారం ఉదయం ఇంటిలో పని చేసే మనిషి డిఎన్‌మూర్తికి ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని బీరువాల్లో వస్తువులు మాయమైనట్లు ఉందని సమాచారం అందించారు. దాంతో డిఎన్‌మూర్తి వారి సతీమణి హుటాహుటిన ఇక్కడకు చేరుకున్నారు. బ్యాంకులో ఉన్న నగలను శుభకార్యాలయాలకు వెళ్ళటానికి తెచ్చుకున్నారు. వాటిని బీరువాలో పెట్టి కుమారుని ఇంటికి వెళ్ళినట్లు సమాచారం.ఇంట్లో ఎవ్వరూ లేని సమాచారాన్ని ఓ ముఠా గమనిస్తుంది.రెక్కి చేసిన తరువాత రాత్రి చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. బంగారు హారాలు,బంగారు గొలుసు, బంగారు బాండు గొలుసులు, బంగారు ఉంగరాలు,నల్ల పూసల గోలుసు, ముత్యాల,పగడాల గోలుసులు లక్ష్మీనాణం,ఇయర్ స్టడ్‌లు వెరసి 134 గ్రాముల బంగారు చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేసినట్లు సిఐ వెంకటేశు తెలిపారు.

# ప్రజా సంక్షేమ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం




### ఇది మంచి ప్రభుత్వం, పొలం పిలుస్తోంది కార్యక్రమం గోడపత్రికను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పాశం ఆవిష్కరణ

చిల్లకూరు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త

ప్రజా సంక్షేమ ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఇది మంచి ప్రభుత్వం, ప్రజా వేదిక, పొలం పిలుస్తోంది కార్యక్రమం గోడ పత్రికను విడుదల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా ప్రభుత్వం పలు హామీలను అమలు చేసిందని ఇది మంచి ప్రభుత్వం అనే నినాదంతో ప్రజల ముంగిటకు ప్రజావేదిక నిర్వహించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్ఫూర్తి ఆదేశాల మేరకు ప్రజలతో మమేకమై కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నామని అలాగే ప్రభుత్వం రైతు సోదరుల మేలు కొరకు పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం చిల్లకూరు మండలం ఏరూరులో ఇది మంచి ప్రభుత్వం అనే బృహత్తర కార్యక్రమం ప్రజా వేదికను స్థానిక ఎమ్మెల్యే, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఏరూరు సర్పంచ్ కామాక్షితో కలిసి జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో ప్రజా ప్రతినిధులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది అనే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఉపయోగార్థం చేపడుతోందని, మంగళవారం నుండి ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే, కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలైన ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ, షుగర్ కేన్, మార్కెటింగ్ శాఖ, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి వారంలో మంగళ, బుధవారం రోజుల్లో మాత్రమే ఉంటుందని రైతులు సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపడుతారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దేవుడి మాన్యం భూమి నందు కౌలు రైతు పండిస్తున్న వేరుశెనగ పంటను డ్రిప్ ఏర్పాటును కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించి అభినందించారు. కౌలు రైతులకు సిసిఆర్సి పత్రాలను ప్రవీణ్ రెడ్డితో పాటు మరి కొంత మంది రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్డిఓ వాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాదరావు, ఏపిఎంఐపి పిడి సతీష్, పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పూడిపర్తి ప్రవీణ్ కుమార్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలి



**వెదురుకుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** పొలం పిలుస్తోంది కార్యక్రమంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్ అన్నారు. మండలంలోని మాంబేడు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడంకు తీసుకువచ్చిన కార్యక్రమంను సద్వినియోగం చేసకోవాలని వ్యవసాయాధికారుల నుంచి సలహాలు, చూచనలు, తీసుకోవాలన్నారు. కాలంకు అనుగుణంగా చేయావలసిన పంటలను రైతులకు చూచించి మంచి దిగుబడి, తక్కువ ఖర్చుతో సాగుచేసి అధిక లాభాలుపొందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గుణశేఖర్, మండల వ్యవసాధికారిణి వనిత, మాంబేడు మాజీ ఆర్‌బికె ఛైర్మెన్ కేశవులు, హార్టికల్చర్, పసుసంవర్ధకశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రొంపిచెర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**రొంపిచెర్ల, సెప్టెంబరు 24 ప్రభాతవార్త** మండల పరిదిలోని కె.ఎన్.కురవపల్లె, వారణాసివారిపల్లెలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక అధికారి మధుసూధన్‌రెడ్డి, సహాయ వ్యవసాయి సంచాలకులు హాజరై రైతుల సమస్యలను పరిష్కరించడానికి పొలం పిలుస్తోంది అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇకపై ప్రతిమంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయఅధికారి సుధారాణి, పశుసంవర్ధక శాఖ డాక్టరు శ్రీదర్, బోడిపాటివారిపల్లె ప్రజాప్రతినిధి రవికుమార్‌నాయుడు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**శాంతిపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** మండలంలోని కర్లగట్ట జడ్పీ హైస్కూల్‌లో ముప్పై మంది విద్యార్థులకు దాతలు రుద్రప్ప, గిరి, శ్రీనివాసులు, రామచంద్రప్ప, చౌడప్పలు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాదమునిరెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ రాము, పిడి మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతి సిఎం చంద్రబాబు - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

**శాంతిపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** పేదల పక్షపాతి సిఎం చంద్రబాబునాయుడు అని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. కోనేరుకుప్పం, అనికెర, రేగడదిన్నేపల్లి, మఠం, ఎంకెపురం గ్రామాల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో వారు ప్రసంగించారు. మెగా డిఎస్సీ ద్వారా 16349పోస్టుల భర్తీకి ఆదేశాలు, పెన్షన్ల పెంపు, అన్న కా ్యంటీన్ల పున:ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారన్నారు. అలాగే విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, నాగరాజు, రమేష్, చంద్రకళ, మునిరెడ్డి, ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎఒ అప్పోజి తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయం



**రామకుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** పేదరిక నిర్మూలనే ఎన్డీయే ప్రభుత్వ ధ్యేయమని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మణీంద్రం, ముద్దనపల్లి, పిఎంకె తాండా, బళ్ల, నారాయణ పురం తాండా పంచాయతీల్లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గ్రామాలను ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో మండల కార్యదర్శి నరసింహులు, సర్పంచ్ సికందర్, చలపతి, కృష్ణనాయక్, టివి రవి, రఫీ, విశ్వనాథ్, గజేంద్ర, వెంకటరమణ, ఆదిల్, ఎంపిడిఒ ఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ

**రామకుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** సంపూర్ణ పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకై రామకుప్పంలో తెదేపా నేతలు, విద్యార్థులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే దోమల సంచారం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉని ్గానిపల్లిలో ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, సీతాపతి, సర్పంచ్ మురళి, రామూర్తి, జయశంకర్, వెంకటరమణ, కృష్ణారెడ్డి, మహేంద్రనాయుడు, గోపాల్‌రెడ్డి, షణ్ముగం, గోపి, శ్రీరాములు పాల్గొన్నారు.

## రైతులు ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

**పెద్దపంజాణి సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** రైతులుప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడిఏ శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చలమంగళం, లింగాపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయశాఖచే పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం రైతులకు 90శాతం రాయతీతో బిందుసేద్యం పరికరాలను అందిస్తోందన్నారు. 5ఎకరాలలోపు పొలంకలిగిన రైతులకు 90శాతం రాయతీ 5నుంచి10ఎకరాల

## సదుంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం



**సదుం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం సదుం మండలంలో మంగళవారం నుంచి ప్రారంభమైంది. మండల పరిదిలోని తాటి గుంట పాలెం, అమ్మగారిపల్లె పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలలో తెదేపా నాయకులు వై.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చి వందరోజులు అయిన సందర్భంగా ప్రభుత్వం చేసిన మంచి పనులను గురించి వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మహేశ్వరరెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచి ఎల్లప్ప, ఉపసర్పంచి రామచంద్రయ్య, గౌతమ్ కుమార్‌రెడ్డి, రాఘవ, నాగేంద్ర బాబు, పవన్, దొరబాబు, లోకేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు

## సంక్షోభంలోను సంక్షేమాన్ని అందిస్తున్న మన ప్రభుత్వం:చల్లా బాబు



**కల్లూరు, సెప్టెంబరు 24 ప్రభాతవార్త** రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం సంక్షోభంలోను సంక్షేమాన్ని అందిస్తున్న మన ప్రభుత్వం అని పుంగనూరు తెదేపా ఇన్‌చార్జి చల్లా రామచంద్రరెడ్డి అన్నారు. మంగళవారం పులిచెర్ల మండలంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఇది మంచి ప్రభుత్వం సంక్షోభంలోను సంక్షేమం-అభివృద్ధికి రెక్కలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రేయింబవళ్లు కష్టపడి రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వంఏర్పడిన నాటినుంచి ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పులిచెర్ల మండల జడ్పీటీసీ మురళీధర్, రామనాథంనాయుడు, మండల స్థాయి అధికారులు, మహిళలు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు సామాజికసేవలో భాగస్వాములు కావాలి



**కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఛైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. ప్రజలను సమాజసేవ పట్ల చైతన్యపరచడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కృషి వెలకట్టలేనిదన్నారు. సమాజసేవే తమసేవగా భావజాలం కలిగిన విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదు వేసినట్లు అవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు మాట్లాడుతూ 1969లో ఎన్ఎస్ఎస్ ప్రారంభించారన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పిఒ మాధవన్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచం మెచ్చిన పాలనాదక్షుడు సిఎం చంద్రబాబు

– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** ప్రపంచం మెచ్చిన పరిపాలనాదక్షుడు సిఎం చంద్రబాబునాయుడు అని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధి కొత్తపేట 14వ వార్డులో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రస ంగించారు. అర్హులకు రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్లు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా వంద రోజుల్లోనే సిఎం చంద్రబాబు చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమాల్లో కమీషనర్ శ్రీనివాసరావు, పార్టీ పరిశీలకుడు గాజులఖాదర్ బాషా, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, శాంతారాం, డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగ ం, కౌన్సిలర్ వేలు, నేతలు అన్సర్, అప్పు, జయమ్మ, రవి, ఉదయ్, కుమార్, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిములకలపల్లికి ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని అడవిములకలపల్లి నుంచి కుప్పంకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రారంభించారు. గతకొంతకాలంగా బస్సుసౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండడం గుర్తించి బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు ఆయన ఈసందర్బంగా పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మార్గాల్లో ఆర్టీసీ సేవలు విస్తరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, డా॥ వెంకటేష్, మాజీ ఎంపిపి సాంబశివం, డిఎం పెంచలయ్య, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, నేతలు వల్లెప్ప, చెక్కునత్తం మణి, కనకరాజ్, జెకె సంతోష్, మంజు, మునిరత్నం, తిమ్మప్ప, దేవేంద్ర పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## బోధనలో నూతన ఒరవడికి నాంది పలకాలి : డిఇఓ



**చౌడేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** విద్యార్థులకు బోధించే విద్యలో నూతన ఒరవళ్లకు నాంది పలకాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు అన్నారు. స్థానిక ఉన్నతపాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు వడ్డించే తీరు, నాణ్యత వంటివి పరిశీలించారు. పరిశుభ్ర వాతావరణంలో నాణ్యతోకూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందనీ, లక్ష్యాలను అధిగమించాలన్నారు. కార్పోరేట్ ధీటుగా విద్యా విధానంలో మార్పులు తెచ్చి ప్రభుత్వ పాఠశాలల్లోనూ కార్పోరేట్ విద్య అందుతోందన్న భావన పిల్లలు వారి తల్లిదండ్రుల్లో తేవాలన్నారు. పాఠ్యాంశాల్లో మార్పులు, చేర్పులు వచ్చాయనీ, వాటిపై అవగాహన తెచ్చుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేసారు. మండలంలోని మర్రిమాకులపల్లి ఉన్నతపాఠశాలలో గల ఆటస్థలం కొరత తీరుస్తామని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు, మండల సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతే రారాజు : జ్యోతి

**చౌడేపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతే రారాజు అవుతాడని మండల వ్యవసాయాధికారిణి జ్యోతి అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలోని గడ్డంవారిపల్లి, పరికిదొన పంచాయతీల రైతు సేవా కేంద్రం పరిధిలోని పొలాల వద్దకు వెళ్ళి రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించారు. వరిపంటలో యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట వంటివి వినియోగిస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. మల్బరీ, వేరుశెనగ యాజమాన్య పద్ధతులను వివరించారు. మాజీ ఎంపిటీసీ వెంకట్రమణ, వేలూరు సుబ్రమణ్యం, చెంగల్రాయుడు, పట్టుపరిశ్రమ ఎఎస్ఒ రామిరెడ్డి, విఎస్ఏ చంద్రకళ, విఎఎ ప్రభావతి, వాసుదేవరెడ్డి, ఈశ్వరయ్య, రైతులు పాల్గొన్నారు.

## గుండ్లసాగరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**గుడుపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** మండలంలోని గుండ్లసాగరం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల వ్యవసాయ అధికారి నాగరాజు పొలం పిలుస్తొంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బాబునాయుడు మాట్లాడుతూ నూతన అధునిక పద్దతులు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందే పద్దతులను రైతులు అనుసరించాలన్నారు. అధికారులు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం మొలైన వాటి గురించి తెలియజేస్తూ అందులో వాడే కషాయాలు మరియూ ద్రవ, ఘనజీవామృతం వాటి తయారీ పద్దతులు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు జనసేనా మండల అధ్యక్షుడు అమీర్, బానుమూర్తి, మణికంట, వెంకటేష్, అధికారులు, రైతులు పాల్గోన్నారు.

## ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం




**చిత్తూరురూరల్, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** చిత్తూరుపట్టణం, సావిత్రమ్మ ప్రభుత్వ మహిలా కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథక దినోత్సవంను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు షమ్స్ అక్తర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీం భారత ప్రభుత్వం చేపట్టినటువంటి స్వచ్చంద ప్రజా సేవ కార్యక్రమమని, యువతలో సామాజిక బాధ్యత, సమాజసేవ యొక్క భావాన్ని పెంపొందించమమే లక్ష్యంగా ఏర్పడిందన్నారు. తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ నేషనల్ సర్వీస్ స్కీంలో పాల్గొనడం వల్ల విద్యార్థులు తమ బాధ్యతను నిబద్దతతో నిర్వహిస్తారని, ఆరోగ్యసంరక్షణ, విద్య, పర్యావరణ పరిరక్షణ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటూ సమాజ అభివృద్ధికి సహకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం స్వచ్చతాహిసేవ కార్యక్రమంలో భాగంగా కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్ విద్యార్థినులతో కలసి ర్యాలీని ప్రారంభిస్తూ ప్లాస్టిక్ రహిత సమాజం ప్రజల ఆరోగ్యానికి మూలమని కళాశాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డాక్టర్ ధర్మమూర్తి, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పోలేరమ్మ జాతరలో అల్లర్లకు పాల్పడే వారిపై చర్యలు

సిఐ వెంకటరమణ



**వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త** ఈ నెల 25, 26 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపణ పోలేరమ్మ అమ్మవారి జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు సిఐ ఏ. వెంకటరమణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అవాంఛనీయ సంఘటన జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 25వ తేదీ రాత్రి అమ్మవారిని తయారు చేసే కుమ్మరి వీధి, అమ్మవారిని అలంకరించే జీనుగుల వారి వీధి, అమ్మవారి ప్రధాన ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారి గ్రామోత్సవం సందర్భంగా లక్షలాదిమంది భక్తులు వస్తారని ఎవరికి ఇబ్బంది లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. డ్రోన్, సిసి కెమెరాలు ద్వారా నిఘా పెట్టినట్లు తెలిపారు. జాతరను ప్రశాంతంగా జరిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐలు నాయక్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌గా నరేంద్ర కుమార్

**వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త** వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ నాగిశెట్టి నరేంద్ర కుమార్ నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ నజీర్ చీరాల కమిషనర్‌గా బదిలీ చేశారు. గతంలో నరేంద్ర కుమార్ వెంకటగిరిలో కమిషనర్‌గా పని చేసి సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. మరల ఆయన వెంకటగిరి కమిషనర్‌గా వచ్చారు.

## పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇద్దరికి చోటు

**వెంకటగిరి, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శ్రీరామదాసు గంగాధర్, లక్ష్మీ నరసింహలకు చోటు దక్కింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దయతో తమకు ఈ పదవి దక్కిందని వారు తెలిపారు. పదవి ఇప్పించినందుకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థికి ఆర్థిక చేయూత



**వాకాడు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త** వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం గ్రామంలోని మంగళవారం శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబా నికి సంబంధించిన ధరణికోట మహేష్ అనే విద్యార్థికి నాగలాపురం గిరిధర్ రెడ్డి, మహేశ్వరమ్మ దంపతులు, ఉప్పల సాంబశివరావు ఆరువేల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు, దువ్వూరు అనసూయమ్మ, మల్లాపు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఇసుక మాపియా బరితెగింపు ...

అడ్డుకుంటే దాడులకు పాల్పడుతున్న ఇసుక అక్రమార్కులు ...

**దొరవారిసత్రం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** దొరవారిసత్రం మండలంలో ఇసుక మాపియా దారులు రోజురోజుకు బరితెగించి దాడులకు పాల్పడుతున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయంలో ఇసుక మాపియాకు పాల్పడిన అక్రమార్కులు ఇప్పుడు ఇసుక మాపియాను అడ్డుకుంటున్న తెలుగు తమ్ముళ్ళపై కక్షకట్టి దాడులకు తెగబడుతున్నారు. మండంలోని వెదురుపట్టు, మోదుగులపాళెం, తనయాలి గ్రామాల సమీపంలోని కాళంగినది నుండి కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా రాత్రిసమయంలొ ట్రాక్టర్లు ద్వార ఇసుకను తరలిస్తూ మాపియాకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వ ్యక్తమౌతున్నాయి. ఈఇసుక మాపియాను గ్రామాల్లో ఎవరైన అడ్డుకొంటే వారిపై బరితెగించి రాడ్లు, కత్తులతో దాడులకు పాల్పడుతున్నారు. ఇందుకు ఉదాహరణ ఆగస్టు నెలలో రాత్రిసమయంలో ఆనేపూడి సమీపంలో ఇసుక ట్రాక్టర్ ఆటోను డీకొంది. అడిగినందుకు ఆటోవారిపై ఇసుక మాపియా దారులు దాడికి తెగబడ్డారు. అదేవిధంగా ఆదివారం రాత్రి మోదుగులపాళెంలో ఇసుక మాపియాను అడ్డుకొనే ప్రయత్నం చేసిన తెలుగు తమ్ముళ్ళను వైసిపి ఇసుక మాపియా దారులు బరితెగించి కత్తులతో నరికి తీవ్రంగా గాయపరిచారు. ఇప్పుడు అతని పరిస్థితి విషమంగా ఉంది. ఈవిధగా ఇసుక అక్రమార్కులు మండలంలో ఏదోఒకచోట దాడులకు తెగబడి ఇసుక మాపియా చేసి లక్షలు దోచుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లాపోలీస్ ఉన్నతాదికారులు స్పందించి దాడులకు పాల్పడుతున్న ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## భూసార పరీక్షలు ఆదారంగా వ్యవసాయసాగు చేపట్టాలి ...ఎడి

**దొరవారిసత్రం సెప్టంబరు 24 ప్రభాతవార్త ;** రైతులు తమపోలాలను భూసార పరీక్షలు చేయించి దానికి ఆదారంగా అనువైన రకాలను వ్యవసాయసాగు చేపట్టాలని సూళ్ళూరుపేట ఎడి అనిత తెలియజేశారు. మంగళవారం దొరవారిసత్రం మండలంలోని తనయాలి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిదిగా పాల్గోన్నారు. ఈసందర్బంగా ఎడి అనిత మాట్లుడుతూ రైతులు వ్యవసాయసాగు చేపట్టే ముందుగా తమ పోలాలను భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనువైన వరికాలను వ్యవసాయసాగు చేపట్టాలని తెలిపారు. మండలంలో 60క్వింటాలు పచ్చరోట్టి విత్తనాలు రైతులకు సబ్సిడి ద్వార అందించడం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయసాగులో మెళుకువలు పాటించడం ద్వార తక్కువ ఖర్చుతో ఎక్కువ లాబాలుపొందవచునన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయసాగులో తీసుకోవాల్సిన జాగ్రర్తలపై పలుసూచనలు, సలహాలు తెలియజేశారు. వ్యవసాయాదికారి జ్యోతి, విఆర్ఓ మురళీధర్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## దాడికి పాల్పడిన నిందితుడు అరెస్టు

**దొరవారిసత్రం సెప్టంబరు 24 ప్రభాతవార్త ;**

మండలంలోని మోదుగులపాళెం ఎస్సీకాలనిలో ఆదివారం రాత్రి ఇసుక మాపియాను అడ్డుకున్నారన్న కోపంతో మయారి సుబ్రమణ్యంపై కత్తితో దాడిచేసినరికి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలో నిందితుడైన శాంతాలం మాధవయ్యను మంగళవారం అరెస్టుచేసి సూళ్ళూరుపేట కోర్టుకు హజరుపరిచినట్లు ఎస్సై అజయ్‌కుమార్ తెలిపారు. దాడికేసులో మిగిలిన ముద్దా యిలు సురేష్, మునిశేఖర్, మునిచంద్రలను త్వరలోనే పట్టుకొని అరెస్టు చేయడం జరుగుతుం దన్నారు. అంతేకాకుండ మండలంలో ఎవరైన చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడి గొడవలకు దిగిన వారిపై చట్టపరమైనచర్యలుతీసుకోవడమేకాకుండరౌడిషీటుఒపెన్ చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## నాలుగేళ్లల్లో ఎన్‌బీకేర్ యూనివర్శిటి

కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

**కోట, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



దేశంలోని ఒక ప్రత్యేక గుర్తింపు కలిగిన ఎన్‌బీకేర్ విద్యాసంస్థలు మరో మైలు రాయి దాటుబోతున్నట్లు ఎన్‌బీకేర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం కోట మండలం విద్యానగర్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికి విశ్వవిద్యాలయంకు ఉండాల్సిన మౌలిక వసతులతో పాటు ఆధునిక భవనాలు, లైబోరేటిలు, క్రీడా మైదానాలు, అతి పెద్ద గ్రంధాలయం తో పాటు మరెన్నో వసతులు ఉన్నాయని చెప్పారు. తమ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించిన ఏందరో నేడు ప్రపంచ దేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మరో నాలుగైదు సంవత్సరాల్లో విశ్వవిద్యాలయంగా మారుబోతుందన్నారు. తన తండ్రి దివంగత మాజీ సీఎం నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఆశయం నేరవేర్చునున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 1979 లో ఆనాడు తన తండ్రి జనార్దన్ రెడ్డి విద్యానగర్‌లో ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించారని పేర్కొన్నారు.

**శ్రీవారి ప్రసాదంలో రాజకీయం :** చంద్రబాబు లాంటి 40 సంవత్సరాలు ఇండస్ట్రీ చెప్పుకోనే నాయకుడు తిరుమల లోని శ్రీవారి ప్రసాదంపై చేసిన ప్రేలాపనలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారియన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు. 100 రోజుల్లో చేపింది చెప్పుకోలేక లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని మండి పడ్డారు. చంద్రబాబుకు మంచి బుద్దిని ప్రసాదించాలని కోరుకుంటున్నానన్నారు. పరిపాలన గాలికొదిలేసి ఇస్తామన్న పథకాలు ఇవ్వకుండా తన చేతకాని తనం బయటపడినప్పుడు తమ నాయకుడు జగన్ పై విమర్శలు చేస్తు న్నారనిధ్వజమెత్తారు. వందరోజులపాలనను డైవర్షన్ చేసేందుకు ఇలా రాద్దాంతం చేస్తున్నారని చెప్పారు.

## అధికారులు..అవినీతి.. రహిత పాలన సాగాలి

**డక్కిలి. సెప్టెంబరు 24, ప్రభాతవార్త,**

మండల స్థాయిలో పని చేస్తున్న అధికారులు అందరూ అవినీతి రహిత పాలన సాగించాలని. ఎవ్వరూ ఏయినా అవినీతికి పాల్పడినా వారిపై తగుచర్యలు తీసుకుంటామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని శ్రీపురం గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. అంతేగాక పోలంబడి కార్యక్రమం ప్రారంభం, సచివాలయ అదనపు గదులును ఎమ్మెల్యే ప్రారంబించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డక్కిలి పంచాయితీలో సర్పంచ్ అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అవినీతి, అక్రమాలకు ఎవ్వరూ పాల్పడ్డా వారిని క్షమేంచేది లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పాలన దిశగా అన్నీ వర్గాల ప్రజలకు పథకాలను అందించాలని కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, మాజీ జట్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్యానాయుడు, డక్కిలి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసన్నకుమారి, పంచాయితీరాజ్ డీఈ లక్ష్మీనారాయణ, ఎంఈవోలు కిల్లా వెంకటేశ్వర్లు, పిన్నక జగదీష్‌బాబు. ఏఈఓలు నాగరాజు. చంద్రశేఖర్. టీడీపీ నాయకుడు అయ్యపరెడ్డి. పలువురు సర్పంచ్‌లు. ఎంపీటీసీ సభ్యులు, పలు గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు పంట సాగుపై పొలం పిలుస్తోంది కార్యక్రమం

**పాలసముద్రం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** రైతులు పంటల సాగుపై అవగాహన కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ అన్నారు, మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు వ్యవసాయ అధికారులు, సిబ్బంది పొలాల్లోకి వచ్చి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. వ్యవసాయ రంగానికి అనుబంధంగా వున్న 14 సేవలను రైతులు వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ డాక్టర్ యశ్విని, సర్పంచ్ నరసింహరాజు, వ్యవసాయ, వెటర్నరీ సిబ్బంది శంకర్, నాదముని, పుష్ప, మధు, భాస్కర్ నాయక్, ప్రతాప్, మునియమ్మ, రైతులు రామకృష్ణరాజు, శ్రీనివాసులు, రామ్‌ప్రసాద్, శ్రీనురాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పక్కాగా వాహనాల కండీషన్

**చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** నగర పరిధిలో పారిశుధ్య, ఇతర కార్యకలాపాలకు వినియోగిస్తున్న వాహనల కండిషన్ పక్కాగా వుండాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ స్పష్టం చేశారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ మంగళవారం మున్సిపల్ వాహనాల షెడ్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ షెడ్డులోని వాహనాల స్థితిగతులపై ఆరా తీశారు. పారిశుధ్య కార్యకలాపాలకు ఎన్నిక వాహనాలు ప్రస్తుతం వినియోగిస్తున్నారు! ఎన్ని వాహనాలకు మరమ్మత్తులు చేయాలి! ప్రస్తుతం రన్నింగ్‌లో ఎన్ని వాహనాలు వున్నాయి! తదితర అంశాలపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిపేరులో వున్న వాహనాలను సత్వరం బాగు చేయాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. వాహనాల రికార్డుల నిర్వహణ పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం కమీషనర్ పారిశుధ్య మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేసి కార్మికుల హాజరును పరిశీలించారు. నిర్దేశించిన సమయంలో పారిశుధ్య పనులను పక్కాగా నిర్వహించి పూర్తి చేయాలని కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ నరసింహ, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## వ్యవసాయంకు పెద్దపీట

ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** సిఎం నారా చంద్రబాబునాయుడు వ్యవసాయంకు పెద్దపీట వేసి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు పంచాయతీలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయం లాభసాటిగా మార్చడానికి ఉద్దేశించిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమం 'పొలం పిలుస్తోంది' ప్రారంభానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ముఖ్య అతిధిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా వున్న సయంలో రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారని ప్రస్తుతం ఆయన అడుగు జాడల్లో సిఎం నారా చంద్రబాబునాయుడు నడిచి రైతులకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు దూర దృష్టితో హైటెక్ సిటీ నిర్మించారని, నేడు రైతులకు సహాయ సహకారాలు అందించడానికి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతులు పంటలు సాగు చేయడానికి వారికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో రైతులు తమ పంటలను విక్రయించడానికి ఆరు రైతు బజార్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, చిత్తూరు రూరల్ మాజీ ఎంపిపి జయచంద్రనాయుడు, చిత్తూరు రూరల్ మండల దేశం అధ్యక్షులు శశికర్‌బాబు, రైతు సంఘ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు

**చిత్తూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం భవిష్యత్తులో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు దీనిని సద్వినియోగం చేసుకుని నిరుద్యోగ యువత భవిష్యత్తు ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని డిఆర్‌డిఎ సమావేశ హాలులో మంగళవారం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, ముత్తూట్ గ్రూప్, యంగ్ మైండ్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్, ఏజిఎస్ హెల్త్ సర్వీసెస్, ఖజానా జ్యువలరీ ప్రైవేటు లిమిటెడ్, క్రియా టెక్నాలజీస్ సంస్థలు పాల్గొన్నాయన్నారు. యువత ప్రభుత్వ, బ్యాంకింగ్, ప్రైవేటు ఉద్యోగాలు లాంటివి సాధించే వరకు నిరంతరం ప్రయత్నిస్తుండాలన్నారు. భవిష్యత్తులో జాబ్ మేళాల ద్వారా మరింత మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. చిన్న ఉద్యోగమైన నిజాయితీతో పని చేయాలని, చేస్తున్న పనిలో నైపుణ్యం మెరుగుపరచుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు 190 మంది అభ్యర్థులు హాజరు కాగా 88 మందికి ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి కలెక్టర్ సుమిత్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడిఎం సరితారెడ్డి, వివిధ ప్రైవేటు సంస్థల హెచ్‌ఆర్‌లు, సీడాప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎస్‌బి లో పీజీ కోర్సులు ప్రారంభం

**తిరుపతి విద్య సెప్టెంబర్ 24,ప్రభాతవార్త:** ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ లో 20 నెలల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ని ప్రారంభించినట్లు ఆ కళాశాల డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐ ఎస్ బి 2001లో కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి మేనేజ్మెంట్ విద్య లో కొత్త బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడానికి, ప్రపంచానికి భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దే లక్ష్యంలో మరో సంచలనాత్మక ప్రోగ్రాం–పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్మెంట్ ఫర్ యంగ్ లీడర్స్ ప్రారంభించినట్లు తెలిపారు.

## విద్యుత్ శాఖ ఏఈగా చలపతి, ఏపీఎంగా మునెయ్య బాధ్యతల స్వీకరణ

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బదిలీల్లో భాగంగా బుచ్చినాయుడు కండ్రిగ విద్యుత్ శాఖ ఏఈగా చలపతి బాధ్యతలు స్వీకరించారు. ఐరాల మండలం నుంచి బదిలీపై రావడంజరిగింది. ఇక్కడ పని చేస్తున్న ఏఈ పుణ్యకోటి రేణిగుంట మండలం బదిలీపై వెళ్లారు. ఏపీఎంగా సి. హెచ్. మునెయ్య బాధ్యతలు చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఇందిరమ్మ తొట్టంబేడు మండలంకి బదిలీపై వెళ్లారు. సీసీలుగా వెంకటరత్నం, వీర జీనప్ప, కేవీబీ పురం మండలం నుంచి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీసీలు శ్రీకాళహస్తి మండలానికి బదిలీపై వెళ్లినట్లు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు మావిళ్ళపల్లి సుధాకర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## ఇది మంచి ప్రభుత్వం పోస్టర్లు ఇంటింటికి పంపిణీ

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంచి ప్రభుత్వం సంబంధించి స్టిక్కర్లు, పోస్టర్లు బుచ్చినాయుడు కండ్రిగ గ్రామంలో ఇంటింటికి పంపిణీ తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. పంచాయతీ సెక్రటరీ ఇందిరమ్మ తెలియజేసిన నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి పోలీసుల తీరే వేరబ్బా!!

పెండ్లి మండపం వద్ద అడ్డంగా బారికాడ్లు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పోలీసుల తీరే వేరబ్బా! అంటూ జనం నొచ్చుకుంటున్నారు. పట్టణంలో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేయటం మంచిదే కానీ ఈ ముసుగులో పోలీసులు ఆచరిస్తున్న విధానాలు పాలకులకు ఇబ్బంది మారింది. పోలీసుల చర్యలతో జనం ఎంఎల్‌ఏను నొచ్చుకుంటున్నారు. శ్రీకాళహస్తి నాలుగుమాడావీధుల్లో వన్‌వే ట్రాఫిక్‌ను అమలు చేస్తున్నారు. అయితే ఒక్కొక్క వీధి 300 మీటర్లు ఉంటుంది. పోలీసులు పెండ్లి మండపం వద్ద రోడ్డుకడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసారు. సగం రోడ్డును పూర్తిగా మూసివేసారు. మధ్యలో పోలీసు గొడుగు. నెహ్రూవీధిలోంచి సినిమా వీధిలోకి వెళ్ళు వాహనాలను పంపుతున్నారు. కానీ పెండ్లి మండపంనుంచి నెహ్రూవీధిలోకి వెళ్ళాలంటే ఒక్క మీటరు కూడా ద్విచక్రవాహనాలను అనుమతించంటం లేదు. ఇక్కడ డ్యూటీ చేసే కానిస్టేబుల్స్ నిత్యం ప్రజలతో ఘర్షణ పడుతున్నారు. విధి నిర్వహించే కానిస్టేబుల్స్ ఇది ' తమ సిఐ ఆదేశాలంటూ' చేతులేత్తేస్తున్నారు. జనం తిడితే తిట్లు తింటున్నారు తప్ప వదలి పెట్టడం లేదు. పెండ్లిమండపం నుంచి వస్త్ర దుకాణాలు, ఆసుపత్రులు, ఎరువుల దుకాణాలు, పాదరక్షల దుకాణాలు మందుల షాపులున్నాయి. పెండ్లిమండపం పక్కనే సుమారు 5-6 మీటర్ల దూరంలో పెద్ద వస్త్రదుకాణం, ఎరువుల దుకాణం, పాదరక్షల దుకాణాలున్నాయి. అక్కడకి వెళ్ళాలంటే నగరివీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి చివరకు రావాలంటే 1200 మీటర్లు తిరుక్కొని రావాల్సి ఉంటుంది. దాంతో ఇదేం ట్రాఫిక్ రూల్స్ అబ్బా అంటూ ప్రజలు పోలీసుల తీరును, పట్టించుకోని ప్రజాప్రతినిధిని గురించి చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించాల్సి ఉంది. లేదంటు పరిపాలనపై ప్రభావం చూపనుంది

## ఆశ్రమాలు సన్మార్గాలకు సూచికలు:గురుబోధనలతోనే ముక్తి



**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** ఆశ్రమాలు, ఆశ్రమ పాఠశాలలు మనిషిని సన్మార్గంలో నడిపే సూచికలని, క్రమశిక్షణ, సంస్కృత బోధనకునిలయాలని, గురుబోధనలు ముక్తికి మార్గమని ఉత్తరప్రదేశ్ మధుర కాశీవవమాశ్రమం పీఠాధిపతి శరవానంద మహారాజ్ అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న స్వామిజీ శుకబ్రహ్మాశ్రమం ఆవరణలో భారత కిసాన్ మేళా ఏర్పాటు చేసారు. బలరాం జయంతి సందర్భంగా ఇక్కడ రైతు సదస్సు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా శరవానందమహారాజ్ మాట్లాడుతూ గురువుల బోధనలతోనే మనిసి సన్మార్గంలో నడుస్తాడన్నారు. దేవుడుగా పూజించే శ్రీకృష్ణుని అన్న బలరాంజయంతిని ఇక్కడ రైతులు జరుపుకోవటం రైతులకు బలరాం దేవుడు చేసిన మేళ్ళు మరువరానివన్నారు. రైతుల పట్ల బలరామదేవునికి గుర్తింపుకు నిదర్శనం ఆయన భుజాన ఉన్న నాగలే నిదర్శనం అని శరవానందమహారాజ్ అన్నారు.

***స్వామీజీకి ఘనస్వాగతం:*** ఒండు నెలల క్రితం ఇక్కడ ఏకాంతం కోసం వచ్చి సంచలనం సృష్టించిన మధుర కాశీవనామాశ్రమ పీఠాధిపతి మంగళవారం ఆశ్రమానికి రావటంతో ఆయనకు ఆశ్రమం వద్ద పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి సారధ్యంలో రైతులు ఘనస్వాగతం పలికారు. పూర్ణకుంభం ఏర్పాటు చేసి వేదపండితులు మారుతీశర్మ వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు పేట జనార్థన్, ఐతా మురళి, కంతా ఉదయ్‌కుమార్, ఆశ్రమ వాసులు, రైతులు పాల్గొన్నారు

## మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో కాళహస్తి విద్యార్థుల ప్రతిభ



**శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త** డాక్టర్ బిఆర్ ఆంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో శ్రీకాళహస్తి మండలానికి చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చూపి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వారిని పాఠశాలల ఉపాధ్యాయులు సత్కరించారు. మంగళవారం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో అభినందిస్తూ సత్కరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను నిర్వహించింది. 14 -17 సంవత్సరాల లోపు పోటీల్లో 8వ తరగతి చదువుతున్నఇ వాసంతి 100 మీటర్లలో, హైజంప్ పోటీల్లో మొదటి స్థానం సాధించింది. లాంగ్ జంప్‌లో రెండ స్థానం సాధించింది. అలాగే షార్ట్ ఫుట్‌లో మూడవ స్థానం సాధించి పాఠశాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసింది. కో కో విన్నర్ టీంలో జి. లాలిత, ఇ వాసంతి, ఎన్ సింధూ, టి. భానుప్రియ, టి. మునిలక్ష్మీ, కె. భార్గవి, పి. మేఘన, బి. దినేష్, సి. జాహ్నవిలు పాల్గొన్నారు. డిస్కస్ త్రోలో సి. రక్షిత ఒరెండవ స్థానం సాధించింది. చదరంగంపోటీల్లో శృతి గేస్, డి. భావన కబడ్డీ వాలిబాల్‌లో వై. జనశ్రీ మూడవ స్థానం సాధించింది. మండల స్థాయి పోటీల్లోగెలుపొందినవిద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో గెలుపొంది జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. పాఠశాల ప్రిన్సిపల్ సి. ప్రభావతి పేరెంట్స్ కమిటి కో ఆపరేటివ్ సభ్యులు సి. సుబ్బారావు ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి మున్సిపల్ ఇంజనీర్లు బదిలి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో కొత్త సిబ్బంది నియామకం జరుగుతుంది. ఇప్పటికే 17 మంది సిబ్బందిని బదిలి చేసారు. మంగళవారం ఇంజనీరింగ్ విభాగం లో పని చేస్తున్న అధికారులకు బదిలి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్‌గా పని చేస్తున్న డిఇఇ లలితకు స్థానం చలనం కల్గింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పని చేస్తున్న డిఇఇ లలితను తిరుపతి కార్పొరేషన్‌కు బదిలి చేయగా ఇక్కడకు తిరుపతితో పఎని చేస్తున్న డిఇఇ సంజీవ్ కుమార్‌ను నియమించారు. ఇక్కడ పని చేస్తున్న ఎఇఇ సాయి సింధూను తిరుపతి కార్పొరేషన్‌కు బదిలి చేయగా తిరుపతి నుంచి తేజస్వీని నియమించారు. ఇక్కడ పని చేస్తున్న టిపిఓ మధుసూధన్‌ను తిరుపతి బదిలి చేసి ఇక్కడకు పొద్దుటూరు మున్సిపాలిటి నుంచి శారదను బదిలి చేసారు.

## తెలుగుదేశం ప్రభుత్వంలోనే ప్రజల సంక్షేమం..ఎంఎల్‌ఏ

తొట్టంబేడు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త



తెలుగుదేశం ప్రభుత్వంలోనే ప్రజలు సంక్షేమంగా ఉంటారని నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పొయ్య, పెద్దకన్నలి గ్రామాల్లో కార్యక్రమాలకు ఆయన హజరయ్యారు. ఈసందర్బంగా ఆయనకు జడ్పీటిసి అర్చనాదేవి, తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడులతో పాటు పలువురు తెదేపా నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏకు పొయ్య గ్రామంలో ఘనస్వాగతం లభించింది. కార్యక్రమంలో తహశీల్దార్ మధుసూధనరావు, ఎంపిడిఓ సురేష్‌బాబు, సిడిపిఓ శాంతిదుర్గ , ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి, పంచాయతీ కార్యదర్శి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఉద్యోగి 7 సంవత్సరాలుగా తిష్ట:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో దీర్ఘకాలంగా ఒకే చోట బదిలి లేకుండా పని చేస్తున్న ఉద్యోగి షణ్ముగం. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొందరు ఇఓలు 15 రోజులకొక మారు బదిలి చేసారు. మరి కొందరు ఇఓలు మూడు నెలల కొక మారుబదిలీలు చేపట్టారు. ఇంకొందరు ఇఓలు రాజకీయ నాయకులుఏ జాబితా ఇస్తే దానినే ఉత్తర్వుల రూపంలో ఇచ్చారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత జరిగిన ఒక బదిలీల్లో పారదర్శకత తో సాగింది. అయితే ఆలయంలో ఒకే ఉద్యోగి ఒకే సీటులో సుమారు 7 సంవత్సరాల నుంచి పని చేస్తున్నారంటే ఆయన జవాబుదారి తనమా? లేక అక్కడ పని చేసే సామర్థ్యం ఉన్న వారు లేకపోవటమా? లేక తన పలుకుబడా? అనేది చర్చనీయాంశంగా మారింది. నేడు ఆలయంలో ఫల సరకులు నాణ్యత కు సంబంధించి వివాదాలు చోటు చేసుకున్నాయి. ఇక్కడ వచ్చే వస్తువులు నాణ్యత లేదు. పరిశీలనలు లేదు. కాంట్రాక్టర్ ఇచ్చే ఇన్‌వాయిసే శాసనంగా స్వీకరిస్తున్నారు. మరి ఆ ఉద్యోగి ఏ అర్హతతో స్టోర్స్‌లోనే పని చేస్తున్నారంటే ఆయన ప్రత్యేకత ఏమిటో ఇఓలకు, శివయ్యకే ఎరుక.

## ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ



**కేవీబీ పురం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కేవీబీ పురం మండల కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని ప్రభుత్వం ఏర్పాటుచేసిన వంద రోజుల్లోనే మంచి పరిపాలన అందించిన ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, ఒల్లూరు సర్పంచ్ సురేష్ చౌదరి, మాజీ ఎంపీటీసీ మునికృష్ణయ్య, ఈ టీడీపీ అఖిల్, ఏపీమోడల్ స్కూల్ వైస్‌చైర్మన్ మునికృష్ణ, మర్రిగుంట టీడీపీ అధ్యక్షుడు మస్తాన్, శ్రీనివాసులు, శంకర్, యువత బాల, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపురంలో స్వచ్ఛభారత్



**రేణిగుంట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీలో భారత ప్రధాని మోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బీజేపీ యువనేత వెంకటాద్రి యాదవ్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మోదీ అతి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మంగళవారం మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు భాస్కర్‌రావు, ఉదయ్, రాజు, రవి, రాజశేఖ ర్, ఉపాధ్యాయులు చంద్ర, సుజన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రుణాలు అందజేసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:



బ్రాహ్మణ కో–ఆపరేటివ్ సొసైటీ(తిరుపతి) ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించి చెక్కులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సంస్థ ప్రతినిధి చిత్రపు హనుమంతరావు సమక్షంలో మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. బ్రాహ్మణ నేతలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అన్నారు. ప్రజల సేవ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్, ఐటీ శాఖ మంత్రి లోకేష్ కట్టుబడి ఉంటారన్నారు. రాష్ట్రంలోని బ్రాహ్మణులకు ప్రభుత్వం అన్ని విధాలాసహకరిస్తుందన్నారు. బ్రాహ్మణ సంఘం కార్యాలయం కోసం రేణిగుంటలో స్థలం మంజూరు చేయాల్సిందిగా బ్రాహ్మణ సంఘం నేతలు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, కార్యదర్శి కృష్ణమూర్తి, కోశాధికారి శివ కుమార్, కార్యవర్గ సభ్యులు దీవన్ గణేష్, అశోక్, ఉమాదేవి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మహాప్రభో...మా గోడు ఆలకించండి

**రేణిగుంట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** అధికారులారా మా గోడు వినిపించుకోండి అంటూ రేణిగుంట మండలం దిగువ మల్లవరం ప్రాంతానికి చెందిన సుమారు 16 గ్రామాల ప్రజలు తమ ప్రతినిధిగా ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి డా. రవిబాబు ద్వారా ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామ కూడలి నుంచి ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని రవిబాబు అన్నారు. వీరిలో విద్యార్థులు, ఉద్యోగులు, వైద్యశాలలకు వెళ్లాల్సిన రోగులు ఉన్నారని తెలిపారు. నేషనల్ హైవే ప్రారంభం అవ్వడంతో బస్సులన్నీ అతివేగంగా ఆగకుండా వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులను పాత రోడ్డులోనే నడపాలని వినతిపత్రంలో కోరారు. బస్సులు నిలపకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ మేనేజర్ తెలిపారని రవిబాబు అన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంస్థ కార్యవర్గ సభ్యులు డా. కోదండరామిరెడ్డి, డా. పార్థసారథి తదితరులు ఉన్నారు.

## గురువుల ఆస్తిపాస్తులు విద్యార్థులే : డిఇఓ



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ అధ్యక్షతన విద్యార్థి సంఘ ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ముందుగా అతిథులు చేత ఈ క్లాస్ రూమ్ ని ప్రారంభించారు. ఎల్ఈడి టీవీని వితరణ చేసిన సంతోషిమాత ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రసాద్ రావు, సతీష్, చంద్రశేఖర్ లను ప్రిన్సిపల్, డిఈఓ అభినందించి. అనంతరం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించి విద్యార్థి సంఘం ఏర్పాటు చేసి వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల నియమ నిభందనలను, పాఠ్య మరియు సహపాఠ్య కార్యక్రమాలన్నింటినీ, వివరిస్తూ కార్యక్రమాన్ని అతిథులు చేత నడిపించారు. టిటిడి విద్యాశాఖాధికారి డాక్టర్ వై నాగరాజు నాయుడు మాట్లాడుతూ ముందుగా విద్యార్థినిలకు శుభాశీస్సులు తెలియజేస్తూ, కళాశాల సీటు రావడం మహాభాగ్యంగా భావించాలన్నారు. డాక్టర్ ఉమారాణి, డాక్టర్ పరమేశ్వర, హాస్టల్ వార్డెన్, అధ్యాపకులు సిబ్బంది ఎన్ సి సి, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

## నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ప్రవేశాలు

**నగరి, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** స్థానికప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశాలను నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ 29వ బెటాలియన్ నుంచి వచ్చిన హవల్దార్ శ్రీ ప్రసాద్, మింజ్ పర్యవేక్షణలో కళాశాల లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భౌతిక పరీక్షలో 23 మంది ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. భాస్కర్‌రాజు తెలియజేశారు. లెఫ్టినెంట్ భాస్కర్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణ, సేవకు, త్యాగాలకు మారుపేరు అని జాతీయ సేవకు సిద్ధంగా ఉండే బాధ్యతాయుత పౌరులని తెలిపారు. వీరు మూడు సంవత్సరాల పాటు రైఫిల్ షూటింగ్, విపత్తు నిర్వహణ, సామాజిక సేవ వ్యక్తిత్వ నైపుణ్యాలు, జాతీయ సమగ్రత వంటి అంశాలపై శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. రెడ్డి నాయక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## వడమాలలో పొలం పిలుస్తోంది

**వడమాలపేట, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** ఆధునిక సాగు పద్ధతులు పాటిస్తూ పంటలు సాగు చేస్తున్న రైతులు మంచి దిగుబడులు పొందుతున్నారని వడమాలపేట వ్యవసాయశాఖ ఏవో విజయకుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వడమాల, లక్ష్మమ్మ కండ్రిగ గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, పశు వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సహాయకులు యమునా, దివ్యమోహన్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన



**సత్యవేడు, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఐపీఎస్ సూచనల మేరకు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్ పర్యవేక్షణలో శ్రీసిటీ సబ్‌డివిజన్ పోలీసు వారు కార్యాచరణ చేపట్టారు. శ్రీసిటీ మత్తు పదార్థాల వాడకం, దాని వలన జరిగే అనర్థాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరిగే దాడులు, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీసిటీ ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో 2కి.మీ రన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల అవగాహన చేసుకుని నేరాలు జరగకుండా తమవంతు సహాయ సహకారాలు అందించి నేర రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో తమవంతు పాలు పంచుకుని నేర నివారణకు నాంది పలికి ముందడుగు వేస్తోందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపండి

**రామచంద్రాపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఏఎంఓ శివశంకర్ అన్నారు. మంగళవారం గంగిరెడ్డిపల్లి పిఎంపి ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి వారీగా విద్యార్థుల ప్రగతిని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాలను మెరుగు పరచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణ, తదితరులు పాల్గొన్నారు.

## నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ



**తిరుపతి విద్య, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:** శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో భూగోళ శాస్త్ర విభాగము, 5 ఏ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్ సి సి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ అధ్యక్షతన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నదులు చాలా అమూల్యమైనవి, మనకు జీవనాధారమైనవి, వాటిని కలుషితం చేయకుండా పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిదీ అని నొక్కి వక్కానించారు. ఈ కార్యక్రమంలో జాగ్రఫీ విభాగాధిపతి డాక్టర్ సి సుజాతమ్మ, అటానామస్ కోఆర్డినేటర్ డాక్టర్ కే. ఉమారాణి, ఐ క్యూ ఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ సి భువనేశ్వరి దేవి, ఎన్ సి సి –సి టి ఓ సిహెచ్ సుహాసిని, డాక్టర్ ఆర్ శ్యామల, డాక్టర్ వరప్రసూన, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది సద్వినియోగం చేసుకోండి..!

**చంద్రగిరి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ కె. లక్ష్మీదేవి కోరారు. నరశింగాపురం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య పద్ధతులను వివరించారు. పశుసంవర్ధకశాఖ వీఏఎస్ డాక్టర్ వంశీకృష్ణ పశువుల్లో కాలానుగుణంగా వచ్చే వ్యాధులను వివరించి, టీకాలను తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందిస్తున్న రాయితీలను వివరించారు. పశువులకు డివార్మింగ్ యాజమాన్య పద్ధతులను వివరించారు. పట్టుపరిశ్రమ, ప్రకృతి వ్యవసాయంపై అధికారులు ప్రయోగాత్మకంగా వివరించారు. ఉద్యానవన అధికారి శైలజ మాట్లాడుతూ నూతనంగా పండ్ల తోటల సాగుకు అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎ. రవికుమార్, ఏఓ విజయభాస్కర్, వ్యవసాయ అధికారులు శ్రీనివాస్, శశిదర్, సిబ్బంది వేదవతి, అప్సర జాన్, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మాజీ అడ్వొకేట్ జనరల్‌పై చర్యలు చేపట్టాలి : విజయ్‌బాబు



**పుత్తూరు, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** రాష్ట్ర మాజీ అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారనే విషయం ఇటీవల బయటపడిన విషయం నేపథ్యంలో నెయ్యి కంటే పంది కొవ్వే ఖరీదు అని సుధాకర్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. నెయ్యి కంటే పంది కొవ్వే ఖరీదనుకుంటేసుధాకర్‌రెడ్డి ఇంట్లోపంది కొవ్వును వినియోగిస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో నాయకులు రవినాయుడు, ధనపాల్, మధుసూదన్‌రాజు, అరవ ప్రకాష్, మణికంఠ పాల్గొన్నారు.

## పుత్తూరు పట్టణాభివృద్ధికి సహకరించండి

కమిషనర్‌ను కోరిన టిడిపి



**పుత్తూరు, సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** పుత్తూరు పట్ట ణాభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. మంగళవారం పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎస్. ఎన్. ధనపాల్ నేతృత్వంలో పార్టీ నాయకులు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. జీవరత్నంనాయుడు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో పుత్తూరు ప్రజలు అత్యధిక సంఖ్యలో టిడిపికి ఓటేసి ఎమ్మెల్యేగా భానుప్రకాశ్ నాయకత్వాన్ని బలపరిచారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కేశవాచ్చారి, మాజీ వైస్ ఛైర్మన్ ఆనంగి ఆనంద్, మాజీ కౌన్సిలర్లు బాబునాయుడు, వి. ఎం. గోపి ఆచ్చారి, నాయకులు కె. వెంకటేష్, బి. ఆర్. మురళీకృష్ణ, డి. జి. ధనపాల్, కేశవ, బాబు తదితరులు పాల్గొన్నారు.

## పాకాల నుంచి పీలేరు మీదుగా రాయచోటికి బస్ సౌకర్యం కల్పించండి

పాకాల, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త



పాకాల మండలం కేంద్రం నుంచి పీలేరు మీదుగా రాయచోటి వరు ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేనందున ప్రయాణికులు కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల ఆర్టీసి ఉన్నతాఇకారులు ఈ రూట్ సర్వీస్లపై దృష్టి సారించి క్షేత్రస్థాయిలో స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసులు ప్రజలకు కల్పించవల్సిందిగా ఏపీ నారా యువశక్తి ప్రెసిడెంట్ మచ్చా దొరస్వామి నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు, ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు.

## స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఉచిత మెడికల్ క్యాంప్

**పాకాల, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త** పాకాల మండలం పాకాలలో కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాకాల పంచాయితి పారిశుద్ధ్య కార్మికులకు కుటుంబ సభ్యులకు ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ యాజమాన్యం వారు మంగళవారం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ ఉచిత మెడికల్ క్యాంపును పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, సర్పంచ్ కస్తూరి ప్రారంభించారు. పాకాల పంచాయితీ ఇఓ మోతి పర్యవేక్షించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాకాల పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, వాసవి ఐ కేర్ హాస్పిటల్ యాజమాన్యం వారు ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాకాల టిడిపి నాయకులు మోహన్, రాజన్, ఇలియాజ్, గుణ, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## బుగ్గ అగ్రహారంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం



**నగరి, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** ఎన్‌డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి కావడంతో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నగరి రూరల్ మండలం బుగ్గ అగ్రహారంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ఇది మంచి ప్రభుత్వం బ్రోచర్‌ను ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్వేటినగరం డిప్యూటీ తాహశీల్దార్‌గా త్యాగరాజు

**కార్వేటినగరం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** కార్వేటినగరం డిప్యూటీ తాహశీల్దార్‌గా యం. త్యాగరాజు మంగళవారం పదవీ బాధ్యతలు చేసట్టారు. చిత్తూరు తాహశీల్దార్ కార్యాలయంలో డి. టిగా విధులు నిర్వహిస్తున్న త్యాగరాజు కార్వేటినగరం డి. టిగా బాధ్యతలు చేపట్టారు. కార్వేటినగరం తాహశీల్దార్ కార్యాలయంలో డి. టిగా విధులు నిర్వర్తిస్తున్న నీలావతి నగరికి బదిలీ అయ్యారు.

## కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూయస్ డిఇ సతీష్‌కుమార్



**కార్వేటినగరం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూయస్ డిఇగా యం ఆర్. సతీష్‌కుమార్ పదవీ భాధ్యతలు చేపట్టారు. కార్వేటినగరంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్ళిన డిఇ శైలజకుమారి సత్యవేడు–1కు బదిలీ అయ్యారు. నగరిలో విధులునిర్వహిస్తూబదిలీపై కార్వేటినగరం డిఇగా సతీష్‌కుమార్ భాధ్యతలు చేపట్టారు.

## కేవీబీ పురంలో పొలం పిలుస్తోంది



**కేవీబీ పురం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** మండలంలోని కేవీబీ పురం, మహాదేవపురం, సుబ్రహ్మణ్యపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణకుమార్, అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో జరిగింది. రైతులకు క్షేత్ర సమస్యలకు పరిష్కారాలు, ప్రభుత్వ పథకాలు, తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తి ఎక్కువ ఆదాయంపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు పొలం పిలుస్తోందిరైతులు పాల్గొని సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో అధికారులు గుణశేఖర్, కల్యాణి, సుధాకర్, వెంకటాచలపతి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి రోజూ పౌష్టికాహారం తీసుకోవాలి

కేవీబీ పురం, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలో కోవనూరు జడ్పీ హైస్కూలులో స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్ సుమతి ఆధ్వర్యంలో పోషకాహర మాసోత్సవంలో భాగంగా కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవాలని, బాల్య వివాహాలు జరగడం వలన కలిగే నష్టాల గురించి తెలియజేశారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని అన్ని రంగాల్లో ముందుండాలని పరిశుభ్రత గురించి ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సుగుణ, ఏఎన్ఎం, ఉపాధ్యాయుల బృందం, గర్భిణీలు పాల్గొన్నారు.

## ఎస్వీ వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం దినోత్సవం

**తిరుపతి విద్య, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతిలో జాతీయ సేవా పథకం దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలలో భాగస్వాములై సేవా దృక్ప థాన్ని అలవర్చుకోవాలని కళాశాల అసోసియేషట్ ఎం.వి డాక్టర్ రమణ విద్యార్థులకు సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ యొక్క ప్రతిజ్ఞ చేపట్టి కామధర్మ సామాజిక సేవ కార్యక్రమాల లో విస్తృతం గా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ వి శైలజ, డాక్టర్ పి శాంతి, డాక్టర్ పి గణేష్ కుమార్, డాక్టర్ బి రమణమూర్తి పాల్గొన్నారు.


**బ్యాంక్ ఆఫ్ ఇండియా**
Bank of India
Relationship beyond banking
తిరుపతి శాఖ
వైష్ణవి టవర్స్, కె.టి.రోడ్డు, తిరుపతి

**[ See Rule-8(1)] స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా, దిగువ సంతకందారు **బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిరుపతి శాఖ** యొక్క అధీకృత అధికారిగా ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని రూల్ 3తో కలిపి చదువుకోవలసిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ **ఋణగ్రహీత : శ్రీ టి. ఉదయ కుమార్, మరియు శ్రీమతి టి. హారిప్రియ గారిని** సదరు నోటీసు అందిన తేది నుండి నోటీసులో బకాయి మొత్తం **రూ.1,10,73,220.48 పై. (అక్షరాలా ఒక కోటి పది లక్షల డెబ్బై మూడు వేల రెండు వందల ఇరవై రూపాయల నలభై ఎనిమిది పైసలు మాత్రమే)** తిరిగి చెల్లించాలని **తేది.29-06-2024 న డిమాండ్ నోటీసు** జారీచేసినారు. సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించాలని సదరు నోటీసు ద్వారా కోరియున్నారు.

ఋణగ్రహీత సదరు సొమ్మును చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత/లుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు, 2002 చట్టంలోని రూల్ 8తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలు వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **తేది.21-09-2024 న స్వాధీన** పర్చుకున్నారు.

సాధారణ ప్రజానీకానికి, ప్రత్యేకించి ఋణగ్రహీత/లకు ఇందుమూలముగా హెచ్చరిక జారీచేయునది ఏమనగా ఈ ఆస్తితో ఎవరు ఏవిధమైన లావాదేవీలు జరుపరాదు మరియు అట్లు చేసిన వారు **బ్యాంక్ ఆఫ్ ఇండియా, తిరుపతి శాఖ** వారి ఛార్జీకి తిరిగి చెల్లించవలసిన నోటీసులోని బకాయి ఉన్న సొమ్ము **రూ.1,10,73,220.48 పై.** + వడ్డీతో సహా లోబడి ఉందును.

సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు తమ ఖాతా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

**స్థిరాస్తి వివరములు : ఐటమ్ నెం.1 :** చిత్తూరు జిల్లా (ప్రస్తుతం తిరుపతి జిల్లా), శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా–తిరుపతి, రేణిగుంట సబ్–జిల్లా, వార్డ్ నెం.10, ఏపిఐఐసి ఇండస్ట్రియల్ ఎస్టేట్, యర్రమరెడ్డి పాలెం గ్రామ ఖాతాల్లో– తూకివాకం పంచాయితీ, రేణిగుంట మండలం, పాత యస్.నెం.30 (భాగం), క్రొత్త యస్.నెం.522, ప్లాటు నెం. యస్4 (భాగం), 2225 చ.గ.లు లేదా 20025 చ.అ.లు విస్తీర్ణం గల ఖాళీ స్థలము శ్రీ టి. ఉదయ కుమార్ గారి పేరున కల యావదాస్తి.

**హద్దులు : తూర్పు :** ప్రైయివేటు భూములు, **పడమర :** 35 అడుగులు రోడ్డు, **ఉత్తరం :** ప్లాటు నెం.యస్4 (భాగం) (ప్లాటు నెం.యస్4 యొక్క మిగిలిన ఆస్తి), **దక్షిణం :** ప్లాటు నెం.యస్5. **20025 చ.అ.లు లేదా 2225 చ.గ.లు విస్తీర్ణం**

**ఐటమ్ నెం.2 :** చిత్తూరు జిల్లా (ప్రస్తుతం తిరుపతి జిల్లా), శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా– తిరుపతి, రేణిగుంట సబ్–జిల్లా, వార్డ్ నెం.10, ఏపిఐఐసి ఇండస్ట్రియల్ ఎస్టేట్, యర్రమరెడ్డి పాలెం గ్రామ ఖాతాల్లో–తూకివాకం పంచాయితీ, రేణిగుంట మండలం, పాత యస్.నెం.30 (భాగం), క్రొత్త యస్.నెం.522, ప్లాటు నెం.యస్4 (భాగం), 1524 చ.గ.లు లేదా 13716 చ.అ.లు విస్తీర్ణం గల ఖాళీ స్థలము అందలి ఏసిసి షీట్ ఇండస్ట్రియల్ షెడ్డు శ్రీ టి. ఉదయ కుమార్ మరియు శ్రీమతి టి. హారిప్రియ గార్ల పేరున తూకివాకం గ్రామ పంచాయితీ వారి ఆమోదంతో మెస్సర్స్ రవి ఫిన్‌టెజ్ పేరున ఫ్యాక్టరీ షెడ్డు నిర్మించుటకు ఎల్.పి.నెం. 136/80 ప్రకారం కల యావదాస్తి.

**హద్దులు : తూర్పు :** ప్రైయివేటు భూములు, **పడమర :** 35 అడుగులు రోడ్డు, **ఉత్తరం :** ప్లాటు నెం.యస్3, **దక్షిణం :** ప్లాటు నెం.యస్4 (ప్లాటు నెం.యస్4 యొక్క మిగిలిన ఆస్తి). **1524చ.గ.లు లేదా 13716 చ.అ.లు విస్తీర్ణం**

తేది : 21.09.2024, ప్రదేశం : తిరుపతి సం/–అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా

